## క్లుప్తంగా

### ట్రాఫిక్ మళ్లింపు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రిగా ఈ నెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను చిల్లకల్లు మీదుగా వాహనాలను మళ్లిస్తున్నట్లు ఎస్ఐ సతీష్ సోమవారం తెలిపారు. రెండు రోజుల పాటు హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలను వైరా మీదుగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా గరికపాడు చెక్‌పోస్టు వద్ద సిబ్బందిని నియమించామని చెప్పారు. వాహనదారులు గమనించాలని కోరారు.

### బుక్ కీపర్‌లను తొలగించేందుకు ఒత్తిడి

వీరులపాడు: మండలంలోని వెలుగు కార్యాలయంలో పని చేస్తున్న బుక్ కీపర్‌లను తొలగించేందుకు టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. మండలంలోని మొత్తం 39 మంది బుక్ కీపర్‌లుగా పని చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ విజయం సాధించటంతో ఎన్నో ఏళ్లుగా డ్వాక్రా సంఘాలకు సేవలందిస్తున్న బుక్ కీపర్‌లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిగా చూపుతూ వారిని తొలగించేందుకు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఏళ్ల తరబడి ప్రజలకు సేవ చేసిన తమకు కనీస సమాచారం కూడా లేకుండా తమను తొలగించేందుకు అధికారులపై ఒత్తిడి చేయటం టీడీపీ నేతలకు మంచి పద్ధతి కాదని బుక్‌కీపర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా పార్టీల పరంగా చూడకుండా ఏళ్ల తరబడి సేవలందిస్తున్న తమను కొనసాగించాలని కోరుతున్నారు.

### పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

వత్సవాయి: రైతులకు కావల్సిన పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లిపెసలు 8 కేజీల బస్తా సబ్సిడీ పోను రూ.536 వరి విత్తనాలు 25 కేజీల బస్తా సబ్సిడీ పోను రూ.920 రైతులు చెల్లించాలని తెలిపారు. ఆర్‌బీకేలలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పా రు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలతో వచ్చి తీసుకువెళ్లాలని తెలిపారు.

### సీనియర్ న్యాయవాది మృతి


గొల్లపూడి నారాయణరావు (ఫైల్)

నూజివీడు: పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది గొల్లపూడి నారాయణరావు (73) ఆదివారం బెంగళూరులో మృతి చెందారు. ఈయన కొన్నాళ్లుగా అనారోగ్యంతో అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. మృతునికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. నారాయణరావు మృతి పట్ల 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఖాసిం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, కార్యదర్శి మడుపల్లి మధు రవిశంకర్, భారత్ బార్ అసోసియేషన్ నాయకులు వైఎస్ దొరై, ఆర్‌వీ సత్యనారాయణ, బసవరాజు రామకృష్ణ, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు సంతాపం తెలియజేశారు. నారాయణరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### తొలకరి వర్షం.. ప్రజలకు ఉపశమనం

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలంలో సోమవారం ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో మండల ప్రజానీకానికి అధిక ఉష్ణోగ్రతల నుంచి ఊరట కలిగింది. జూన్ మొదటి వారం ప్రారంభం నుంచి చెదురు మదురు జల్లులు పడటంతో పాటు మండల రైతాంగం పాడి దుక్కులకు శ్రీకారం చుట్టారు. పచ్చిరొట్ట విత్తనాలను చల్లేందుకు రైతులు సంసిద్ధం అవుతున్నారు. మరో రెండు రోజుల్లో బోరు బావుల కింద వరి నారుమడులు పోసేందుకు రైతు భరోసా కేంద్రాల వద్ద నుంచి వరి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

### తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.3.97 లక్షలు

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల హుండీ ఆదాయం రూ.3,97,500 వచ్చినట్లు దేవాలయ కార్యనిర్వహణ కార్యదర్శి బొగ్గవరపు రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు నెలల 28 రోజులు తరువాత ఆలయ ధర్మకర్త చెలికాని వెంకట సత్య వరప్రసాద్, అంబారుపేట దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి పామర్తి సీతారామయ్య, భక్తులు, గ్రామస్తుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరిగిందని తెలిపారు.

### ఎస్టీయూ మండల కార్యదర్శిగా కోటమ్మ



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల ఎస్టీయూ ప్రధాన కార్యదర్శిగా కొవ్వలి కోటమ్మ ఎన్నికై నట్టు అధ్యక్షుడు వేణుగోపాలరావు తెలిపారు. ఆగిరిపల్లిలో సోమవారం మండల ఎస్టీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈదులగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కొవ్వలి కోటమ్మ ఎస్టీయూ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై నట్టు మండల అధ్యక్షుడు మక్కే వేణుగోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు.

# తొలకరి కాలం.. వ్యాధులకు అవకాశం

- పశువులకు గాలికుంటు, గొంతువాపు వ్యాధులు సోకే అవకాశం
- ముందస్తు టీకాలతో అడ్డుకట్ట


ఎద్దుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది


మోగులూరులో గొర్రెకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

కంచికచర్ల : వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు, పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట ప్రాంతమైన నందిగామ నియోజకవర్గంలో రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. పంటసాగులో నష్టమొచ్చినా కరువు కాటకాలొచ్చినా కలిగే లోటును పాడి పరిశ్రమతో పూడ్చుకుని జీవనం కొనసాగిస్తుంటారు. అలాంటి కీలక ఆధారమైన పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**ఈ కాలంలోనే వ్యాప్తి..**

వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు సోకే ప్రమాదముంది. ఇవి జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకు తొలకరి సమయంలోనే అధికంగా వ్యాప్తి చెందుతుంటాయి. ఈ వ్యాధులు సోకితే పాల దిగుబడి తగ్గటంతో పాటు పశువులు మృతిచెందే ప్రమాదం కూడా లేకపోలేదు. దీంతో పాడి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వర్షాకాలంలో కలుషితమైన నీరు, మేత కారణంగా పశువుల్లో రోగ నిరోధక శక్తి తగ్గి పలు వ్యాధులు సంక్రమిస్తాయి. దీంతో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

**పాడి పరిశ్రమే ఆధారం..**

కంచికచర్ల మండలంలోని 16 గ్రామాల్లో రైతులు ఎక్కువమంది పాడి పరిశ్రమపై ఆధారపడి ఉన్నారు. మండలంలోని కంచికచర్ల, మోగులూరు, గండేపల్లి, వేములపల్లి పరిటాల, గొట్టుముక్కల పశువైద్యశాలల ఆధ్వర్యంలో ఆవులు 700, ఎద్దులు 300, గేదెలు 10,300, గొర్రెలు 16,800, మేకలు 3,300 ఉన్నాయని మండల పశువైద్యాధికారి విజయ్ తెలిపారు.

**టీకాలు తప్పనిసరి..**

పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి. కొందరు రైతులు పాల దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించేందుకు వెనకడుగు వేస్తుంటారు. టీకాలు వేయటంతో పాల దిగుబడి తగ్గిపోతుందనేది ఒక అపోహ మాత్రమే. అలాంటిదేమీ జరగదని పశువైద్యులు అంటున్నారు. వ్యాధులు ముదిరి పశువులను కోల్పోవటం కన్నా ముందస్తు టీకాలు వేయిస్తే వ్యాధులు సోకకుండా నివారించవచ్చని వైద్యులు చెపుతున్నారు.

**గొంతువాపు అంటువ్యాధే..**

వర్షాకాలంలో ప్రధానంగా పశువులకు గొంతువాపు వ్యాధి సోకుతుంది. దీనినే గురక వ్యాధి అని కూడా అంటారు. గేదెలు, ఆవులు దూడల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు, మేకలకు కూడా వ్యాపిస్తుంటుంది. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కక్కుతూ గురక, శ్వాస పీల్చటం కష్టమవుతుంది. జ్వరం తీవ్రత 107 డిగ్రీల వరకు ఉండి, గొంతు కిందికి నీరు దిగి గొంతు వాపు వస్తుంది. ఈ వ్యాధి సోకిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**గాలికుంటు వ్యాధితో తీవ్ర జ్వరం..**

గాలికుంటు వ్యాధి తల్లిపాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షాకాలంలో గేదెలు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికి ఈ వ్యాధి సోకుతుంది. జ్వరం తీవ్రత 105 డిగ్రీల వరకు ఉండి నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువులు నడవలేని స్థితికి చేరుకుని మేత తీసుకోలేక నీరసిస్తాయి. ఈ వ్యాధుల వ్యాప్తిపై పశువులు, జీవాల పెంపకందారులు అప్రమత్తండా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ముందస్తు టీకాలు వేయించాలి



ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పాడి రైతులు పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. ముందస్తుగా టీకాలు వేయిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇప్పటికే గ్రామాల్లో పశువులు, జీవాలకు టీకాలు వేస్తున్నాం. పాడి రైతులు పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి.

–విశ్వనాథపల్లి విజయ్, మండల పశువైద్యాధికారి, కంచికచర్ల

# యూటీఎఫ్ నేతల అభినందన


అభినందనలు తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెనుగంచిప్రోలు: నూతనంగా ఎన్నికై న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ను సోమవారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో అభినందనలు తెలియజేయటంతో పాటు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ జిలాని, సుబ్రమణ్యస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ ప్రైమర్ సాహెబ్, నాయకులు చాగర్ల రామారావు, లింగయ్య, రవీంద్రకుమార్, వెంకటేశ్వరరావు, నాయక్, బి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు అధికారులు, ఉద్యోగుల అభినందనలు**

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ను పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.రఘురాం, అసిస్టెంట్ మేనేజర్ జి.రాంబాబు ఆయన నివాసానికి వెళ్లి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి చెందిన జిల్లా సహాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి జె.సుధానంద్, పేట మండల శాఖ బాధ్యులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు, పెనుగంచిప్రోలు మండల శాఖ బాధ్యులు ఎండీ.జిలానీ, ఎన్.సుబ్రహ్మణ్యస్వామి, వత్సవాయి మండల శాఖ బాధ్యులు పెసరమెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లిక నరసింహారావు, చాగర్ల రామారావు, జీవీటీ.రాజశేఖర్, చారి, ఎన్ఆర్‌పీఎస్.రెడ్డి, కె.సాయిశ్రీనివాసరావు, వీవీ.సుబ్బారావు, ఎస్.పుల్లయ్య తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యం



ముసునూరు: ప్రతి ఇంటా, బయటా మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యం ఏర్పడి సమస్త జీవరాశి మనుగడకు దోహదపడుతుందని ఎంపీడీఓ పద్మావతీదేవి అన్నారు. మండలంలోని గోపవరం, కాట్రేనిపాడు, ముసునూరు, యల్లాపురం గ్రామాల్లో ఉపాధి హామీ ఏపీఓ రోజ్‌లీల ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటా విధిగా మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. వాతావరణ కాలుష్య నివారణ కోసం వేప, మర్రి, కానుగ మొక్కలను పెంచాలని ప్రజలకు సూచించారు. వాతావరణ కాలుష్య నివారణ, పర్యావరణ సమతుల్యం కోసం పాఠశాలల యాజమాన్యాలు విద్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తం


చెక్కపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్

ముసునూరు: సైబర్ నేరాల వలలో పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించేలా ప్రజల్లో చైతన్యం రావాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్కిరెడ్డిగూడెం బ్రాంచ్ మేనేజర్ ఆర్.ప్రవీణ్‌కుమార్ సూచించారు. చెక్కపల్లిలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సైబర్ నేరాల నిరోధంపై సోమవారం బ్యాంకు ఖాతాదారులు, వినియోగదారులు, రైతులు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పల్లెలు, పట్టణాల్లో సైబర్ నేరగాళ్లు ఓటీపీలు, లోన్ యాప్‌ల పేరుతో అందరినీ బురిడీ కొట్టిస్తున్నారని అన్నారు. ఏటీఎంల వద్ద నగదు బయటకు తీసుకునే సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.సైబర్ నేరాల బారి నుంచి కాపాడుకునేందుకు ప్రజల్లో చైతన్యం అవసరమన్నారు. లోన్ యాప్‌ల బారిన పడకుండా జాగ్రత్త వహించేలా ప్రజలను చైతన్యపర్చాలని సిబ్బందికి సూచించారు. సైబర్ నేరాల నిరోధానికి టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాల్లో నగదు అధికారి తిరుపతిరావు, అకౌంటెంట్ శివయ్య, వినియోగదారులు పాల్గొన్నారు.

### ఆలయానికి వెండి శఠగోపం సమర్పణ


ఆలయ పూజారికి శఠ గోపం అందజేస్తున్న దాతలు

చాట్రాయి: సి.గుడిపాడులోని నాగ లింగేశ్వరస్వామి ఆలయానికి ఎన్టీఆర్ జిల్లా ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గద్దె ప్రదీప్, రమ్య దంపతులు రూ.1.05 లక్షలు విలువ చేసే వెండి శఠగోపం, వెండి ప్లేటును సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శరత్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లు సత్యనారాయణరెడ్డి, మందపాటి రఘుపతిరెడ్డి, దేశిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ ప్రకటించాలి



తిరువూరులో ఏఐవైఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరాజులు

తిరువూరు: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మెగా డీఎస్సీ నిర్వహణకు కార్యాచరణ చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు కోరారు. తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో సోమవారం ఏఐవైఎఫ్ కార్యకర్తల సమావేశం జరిగింది. మెగా డీఎస్సీ నిర్వహణ ఫైలుపైనే తొలి సంతకం చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఉపాధ్యాయ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి చెల్లింపు, 20 లక్షల ఉద్యోగాల భర్తీ తదితర హామీలను కూడా నెరవేర్చడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సుభానీ, తిరువూరు పట్టణ శాఖ అధ్యక్షుడు మురళి, జిల్లా కోశాధికారి మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రైవేటు స్కూళ్లపై ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి


సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్, సీపీఐ నేతలు

నూజివీడు: రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో తేజోమణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రైవేటు విద్యాసంస్థలు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని వాపోయారు. పాఠశాల ఫీజు కాకుండా అడ్మిషన్ ఫీజు, బస్సుల ఫీజు, నోటు బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల పేరుతో వేలాది రూపాయలను అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.1,500కు లభ్యమయ్యే పాఠ్య పుస్తకాలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారి స్కూల్లో రూ.3వేల నుంచి రూ.4వేలకు విక్రయిస్తున్నారన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు తమ పిల్లలకు మంచి విద్యను అందించాలంటే తలకు మించిన భారంగా తయారైందన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు సంబంధించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తప్పకుండా తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నూజివీడు నియోజకవర్గ నాయకులు పి.ప్రవీణ్, పి.ప్రేమ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

# మీర్జాపురం సొసైటీ అధ్యక్షుడికి సన్మానం


అధ్యక్షుడిని సత్కరిస్తున్న రైతులు, సిబ్బంది

నూజివీడు: మీర్జాపురం సొసైటీ అధ్యక్షుడు బడుగు రంగారావు పదవీ విరమణ సందర్భంగా సోమవారం రైతులు, సంఘ ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. సహకార సంఘం అభివృద్ధికి బడుగు రంగారావు కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఆయన్ను రైతులు, ఉద్యోగులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు గోళ్ళ లోకేశ్వరరావు, పాలకేంద్రం సొసైటీ మాజీ అధ్యక్షుడు అట్లూరి వెంకటేశ్వరరావు, మామిళ్లపల్లి రాజబాబు, గోళ్ళ విజయరాజు, సొసైటీ మాజీ డైరెక్టర్ బడుగు రవి, దోనేపూడి సూరయ్య, సత్యనారాయణ, దండు పోయిన శ్రీనివాసరావు, సొసైటీ సీఈవో నీలం నాగేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# తగ్గుతున్న కుండల వాడకం

ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్న తయారీదారులు


ఆరపెట్టిన మట్టిపాత్రలు

పెనుగంచిప్రోలు: కులవృత్తులు నిరాదరణకు గురవుతున్న తరుణంలో వాటిపై తరతరాలుగా ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి జీవితాలు దుర్భరమవుతున్నాయి. మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో సుమారు 50 కుటుంబాల వారు ఇప్పటికీ కుండల తయారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కండలు కరిగించి వారు తయారు చేసిన కుండలు ఘనంగా మోగుతుంటే వారి జీవితాలు మాత్రం ఓటి మోత మోగుతున్నాయి. పేదవాడి ఫ్రిజ్‌గా పేరు పొందిన మట్టి కుండలకు గతంలో పల్లెల్లో, పట్టణాల్లో మంచి ఆదరణ లభించేది. అయితే రానురాను ఫైబర్, ప్లాస్టిక్ వాడకం పెరగటంతో కుండల వాడకం బాగా తగ్గింది. ప్రస్తుతం కుండలు కొనేవారు లేక తయారీదారులు వేరే పనులకు వలస వెళ్తున్నారు. అయితే గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి భక్తులు తప్పనిసరిగా కుండల్లో పొంగళ్లు తయారు చేసి బోనాలు సమర్పించటం ఆనవాయితీ కాబట్టి కొంత వరకు భుక్తి దొరుకుతోందని వారు పేర్కొంటున్నారు.

**కుండల తయారీ ఇలా..**

నాణ్యమైన బంక మట్టిని తీసుకువచ్చి రెండు, మూడు రోజులు నీటిలో నానపెడతారు. బాగా నానిన మట్టిని కాళ్లతో తొక్కుతూ చిత్తడిగా మారుస్తారు. అనంతరం ఎండలో ఆరబెట్టి సన్నని మట్టికోసం వడకడతారు. మళ్లీ సమ పాళ్లలో నీటిని కలిపి మెత్తని ముద్దలుగా చేసి బూడిదను చల్లుతారు. ఈముద్దలను సారెపై ఉంచి చక్రం తిప్పుతూ తమ చేతినైనైపుణ్యంతో కావాల్సిన ఆకారాల్లో మట్టి పాత్రలు, కుండలు, ముంతలు తయారు చేస్తారు.

ఇలా తయారు చేయగా పచ్చి కుండలను వారం రోజులకు పైగా ఎండలో ఆరపెడతారు. ఈదశలో ఆరిన కుండలను వాములో జాగ్రత్తగా పేర్చి కట్టెలు, వరిగడ్డి, రంపపుపొట్టు వేసి కాలుస్తారు. దీంతో మట్టి కుండలు గట్టి తనాన్ని సంతరించుకుంటాయి. కష్టపడి తయారు చేసిన కుండలకు ఆదరణ తగ్గటంతో ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నామని తయారీదారులు వాపోతున్నారు. అయితే గ్రామంలోని శ్రీతిరుపతమ్మ అమ్మవారు చాలా వరకు మా కుటుంబాలు మొత్తం కుండల తయారీ మానకుండా చూస్తున్నారన్నారు.

### అమ్మవారే ఆదుకుంటోంది



గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారే మమ్మల్ని ఆదుకుంటోంది. భక్తులు తప్పనిసరిగా అమ్మవారికి పొంగళ్లు చేయటం ఆనవాయితీ. ఇందుకు అవసరమైన చిన్న కుండలు, ముంతలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాం.

–బాదిశ చిన్న మీరయ్య

# పేస్కేల్ సవరణ చేయాలని సీఎస్‌కు వినతి


విజయవాడలో సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న జానీపాషా, సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా యూనియన్ సభ్యులతో కలసి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో సోమవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. వార్డు, సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పదోన్నతుల సమస్యలు, పే స్కేల్ సవరణ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రోజా ప్రకాష్, సమాచార కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర సమన్వయకర్త శశిధర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కోదండ రామాలయానికి భక్తుల విరాళాలు

ఆగిరిపల్లి: స్థానిక విజయవాడ రోడ్డులోని కోదండ రామాలయానికి భక్తులు విరాళాలు అందజేశారు స్వామివారి నిత్య ధూప దీప నైవేద్యాల కోసం శ్రీరామ్ హరిప్రసాద్, శ్రీకాకుళం వెంకట నాగేంద్రం రూ.2 లక్షలు, ఏడో వార్డ్ మెంబర్ యండూరి ప్రణీత్ రూ.50 వేలు ఆలయ కమిటీ కార్యదర్శి మడుపల్లి గోపాల్, ఉపాధ్యక్షుడు బెజవాడ ముత్యాలుకు అందజేశారు.

### బాబూరావు కుటుంబానికి ఆర్థిక సహాయం



చాట్రాయి: మండల విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కంకట బాబూరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు, విద్యాశాఖ ఆధ్వర్యంలో మృతుడి భార్య మంజులతకు రూ.1.76 లక్షల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మాచారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పైడిమర్రి దేశభక్తికి ప్రతిజ్ఞ నిదర్శనం

తిరువూరు: భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్ అన్నారు. తిరువూరు వాణీ హిందీ విద్యాలయంలో సోమవారం ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు 108వ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రఘునందన్ మాట్లాడుతూ 1962లో ఆంధ్రుడైన పైడిమర్రి తెలుగులో రాసిన ప్రతిజ్ఞను తదుపరి అన్ని భాషల్లోకి అనువదించారని, దేశవ్యాప్తంగా ఈ ప్రతిజ్ఞను విద్యార్థులు ఆలపించడం తెలుగువారికి గర్వకారణమన్నారు. సర్వమత సమానత్వం, భిన్నత్వంలో ఏకత్వం ప్రాముఖ్యతను ప్రతిజ్ఞ చాటి చెబుతుందన్నారు. పైడిమర్రి చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ప్రత్యేకావసరాలు గల బాలబాలికల గుర్తింపు


ప్రత్యేకావసరాలు గల బాలబాలికల గుర్తింపు సర్వేలో పాల్గొన్న ఎంఈఓ సుధాకర్

విస్సన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో ప్రత్యేకావసరాలు గల బాలబాలికలు 19 మందిని గుర్తించినట్లు ఎంఈఓ ఇ.సుధాకర్ తెలిపారు. ప్రత్యేకావసరాలు గల బాలబాలికల గుర్తింపు సర్వేలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రత్యేకావసరాలుగల పిల్లల కోసం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక విద్యను అందిస్తోందని తెలిపారు. ప్రతి సోమవారం భవిత కేంద్రంలో అవసరమైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తారన్నారు. సంవత్సరానికి ఒకసారి స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. ప్రత్యేకావసరాలు గల బడి ఈడు పిల్లలందరూ భవిత కేంద్రం లేదా స్థానిక పాఠశాలల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ ఉపాధ్యాయులు ఎం.కృష్ణప్రసాద్, డి.రాముడు పాల్గొన్నారు.